క్లుప్తంగా

బాధితులకు పరామర్శ

ఇచ్ఛాపురం రూరల్: అనకాపల్లిలోని ఉషా ప్రైమ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 'సెజ్' బాధితులను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్సీ నర్తు రామారావు శుక్రవారం పరామర్శించారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు.

రికార్డుల పరిశీలన

కాశీబుగ్గ: కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌ను శుక్రవారం జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీఐ మోహనరావు, ఎస్‌ఐ పారినాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణాష్టమి వేడుకలకు ఆహ్వానం



ఎమ్మెల్యే శిరీషను ఆహ్వానిస్తున్న యాదవ సేవా సమితి ప్రతినిధులు

కాశీబుగ్గ: ఈ నెల 26న పలాస రైల్వే మైదానంలో జరిగే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను విజయవంతం చేయాలని పలాస నియోజకవర్గ యాదవ సేవా సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, మందస మాజీ ఎంపీపీ దాసరి తాతారావు, జేడీ కార్మిక సంఘ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి, దడియాల నరసింహులు, బద్రి గోపాల్, రోణగల సత్యం పాల్గొన్నారు.

టెక్కలిలో మంత్రి పర్యటన



భవానీనగర్‌లో పర్యటిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి: మంత్రి అచ్చెన్నాయుడు శుక్రవారం టెక్కలిలో పలు వీధుల్లో పర్యటించారు. భవానీనగర్, అయ్యప్పనగర్, పట్టుమహదేవి కోనేరు గట్టుతో పాటు మరి కొన్ని వీధులను సందర్శించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. పట్టుమహదేవి కోనేరు గట్టును పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈయనతో పాటు తహసీల్దారు దిలీప్‌చక్రవర్తి, నాయకులు బి.శేషు, కె.లవకుమార్, ఎం.సుందరమ్మ, ఎం.రాము, ఎం.పురుషోత్తం, బి.కాశీ, కె.కామేష్, ఎల్.శ్రీనివాస్ ఉన్నారు.

నగరంపల్లి గ్రామస్తుల ఔదార్యం



సాయం అందిస్తున్న గ్రామస్తులు

పలాస: నగరంపల్లి గ్రామానికి చెందిన సింహాద్రి సురేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. పేద కుటుంబం కావడంతో గ్రామస్తులు సమష్టిగా చందాలు వేసుకొని రూ.54,601 ఆర్థిక సహాయం శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త సిస్టు మనోజ్, బమ్మిడి లక్ష్మీపతి, సంపతరావు ప్రసాద్, కొరికాన రవి, బంగారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి సాయం



సాయం అందిస్తున్న సభ్యులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండి గోవిందపురంలో పేద కుటుంబానికి చెందిన పుట్ట గౌతమి వివాహానికి స్థానిక యువతరం సేవాసమితి ప్రతినిధులు శుక్రవారం రూ.25వేలు అందజేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు చింత మురళి, ఇన్‌చార్జిలు గౌరకల సునీల్, బత్తిని విఘ్నేష్, కోడి నిహాల్, అన్నెపు లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఘనంగా అంతరిక్ష దినోత్సవం



బ్రాహ్మణతర్లా హైస్కూలులో అంతరిక్ష వేడుకలు

పలాస: మండలంలోని బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. చంద్రయాన్–3 ల్యాండర్ పెయింటింగ్ వద్ద జాతీయ జెండాలతో జై విజ్ఞాన్ జై భారత్ అంటూ విద్యార్థులు, ఉపాధ్యాయులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్వీ రమణరావు, సైన్సు ఉపాధ్యాయులు కొయ్యల శ్రీనివాసరావు, సుధాకుమారి, పద్మ, చంద్రశేఖర్, శివప్రసాద్, మెహర్ సుధ, కృష్ణవేణి పాల్గొన్నారు.

నైట్ వాచ్‌మేన్‌ను నియమించాలి



కొందరు మద్యం మత్తులో ఆస్పత్రికి వస్తుంటారు. వారిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వ/ప్రైవేటు ఆస్పత్రుల వద్ద పూర్తి స్థాయిలో సెక్యూరిటీ గార్డులు, నైట్ వాచ్‌మేన్‌లు ఉండాలి. వైద్యులు, సిబ్బందిపై దాడికి పాల్పడిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదు. నిందితులపై కఠిన చర్యలు తీసుకున్నప్పుడే కోల్‌కతా వంటి ఘటనలు పునరావృతం కాకూడదు.

– డాక్టర్ ఆర్.అంజలి, వైద్యాధికారి, వెంకటాపురం పీహెచ్‌సీ, వజ్రపుకొత్తూరు మండలం



ప్రత్యేక చట్టం తేవాలి



వైద్య సిబ్బందిపై దాడులు జరగకుండా ప్రత్యేక చట్టం తీసుకురావాలి. ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందజేస్తున్న వైద్య సిబ్బందికి ఎటువంటి ఇబ్బందికరమైన పరిస్థితులు లేకుండా చట్టాలు కఠినతరం చేయాలి. కోల్‌కతా ఘటనలో నిందితులకు వేసే శిక్షతో కనువిప్పు కావాలి.

– ఎస్.గాయత్రి, వైద్యాధికారి, కె.కొత్తూరు పీహెచ్‌సీ, టెక్కలి మండలం

సాగునీరు అందేనా?

- ఎండిపోతున్న వరి నారు
- ఆందోళనలో కిష్టపురం రైతులు



కిష్టపురంలో ఎండిపోతున్న పంటపొలం



పూడిక తీయాల్సిన వంశధార అనుసంధాన వరదకాలువ

కాశీబుగ్గ: సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పలాస నియోజకవర్గంలో పలు ప్రాంతాలకు వంశధార నీరు వచ్చినా లక్ష్మీపురం పంచాయతీ కిష్టపురం గ్రామ పరిధిలోని కాలువలకు మాత్రం ఇంతవరకు నీరు చేరలేదు. దీంతో 50 ఎకరాలకు పైగా వరి నారు ఎండిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉభాలు వేసి నెలరోజులు జరుగుతున్నా నీరు అందడం లేదని చెబుతున్నారు. డబ్బులు కట్టి ఇంజిన్లు పెట్టి నీరు పెడుతున్నా సరిపోవడం లేదని అంటున్నారు. కొందరు రైతులు వ్యవసాయాన్ని వదులుకోలేక దిగుబడి రాకపోయినా తిండి గింజలైన మిగులుతాయనే ఆశతో ఒక్కో తడుపునకు రూ.2 వేలు ఖర్చు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పిల్ల కాలువలను బాగుచేసి సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

చర్యలు చేపట్టాలి..



సాగునీరు అందక ఏం చేయాలో దిక్కుతోచడం లేదు. వంశధార కాలువకు అనుసంధానంగా ఉండి బాగుచేయకపోవడంపై ఇరిగేషన్, మైనర్ ఇరిగేషన్, పంచాయతీరాజ్, వంశధార అధికారులకు ఫిర్యాదులు ఇచ్చాం. అయినా స్పందించేవారు లేరు.

– కామేశ్వరరావు, రైతు, కిష్టపురం, పలాస మండలం

దాతల సహకారంతో విద్యాభివృద్ధి



విద్యా సామగ్రి అందిస్తున్న దాత, విద్యాశాఖాధికారులు

వజ్రపుకొత్తూరు రూరల్: ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు దాతల సహకారంతో మరింత విద్యాభివృద్ధి జరుగుతుందని మండల విద్యాశాఖాధికారులు డి.దాశరథి, బి.వెంకటరమణ అన్నారు. కాశీనగర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గున్న సుభాష్ కుమార్తె నిత్యచాతుర్య పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం అదే పాఠశాలలో చదువుతున్న 300 మంది విద్యార్థులకు విద్యా సంబంధిత సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ డి.కేశవరావు, ఉపాధ్యాయులు ధనుంజయ, వెంకటరమణ, శిరీష, త్రినాథ్, మోహన్‌రావు పాల్గొన్నారు.

మహిళలకు ఆత్మరక్షణ విద్య అవసరం



చిన్నారులను అభినందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: ప్రస్తుత సమాజంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా మహిళలు, బాలికలకు ఆత్మరక్షణ విద్య చాలా అవసరమని ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అన్నారు. పట్టణంలోని స్కూల్ ఆఫ్ తైక్వాండో ఆవరణలో ఓపెన్ నేషనల్ తైక్వాండో పోటీల్లో విజేతలకు కోచ్ సీహెచ్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. కోలకతాలో జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీలో బంగారు పతకాలు సాధించిన పి.సత్యశ్రీ, ఏ.వినయ్, డి.జ్ఞానేశ్వరి, బి.మోక్ష, పి.దివ్య, ఏ.ఉషశ్విని, ఏ.కృతజ్ఞ, వి.మనీష్‌రెడ్డి, బి.మోహిత్, దుశ్యంత్, రజిత పతకాలు సాధించిన హర్షిని, దమయంతి, కాంచన, జాహ్నవి, సాయి, ఎండీ నూరుద్దీన్, చందు, అఖిల్‌లను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు, కౌన్సిలర్లు ప్రేమ్‌కుమార్, కాల్ల దిలీప్, న్యాయవాది రాంబాబు, ఎస్‌సీరావు, మధు, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఆంధ్రకేసరి సేవలు నిరుపమానం



కవిటి: పెద్ద ఎర్రగోవిందపుట్టుగలో టంగుటూరి జయంతి వేడుకలో చిన్నారులు

కవిటి: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి దివంగత టంగుటూరి ప్రకాశం పంతులు ఆంధ్రులకు చేసిన సేవలు నిరుపమానమైనవని ఎంపీడీఓ పి.సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆంధ్రకేసరి జయంతి నిర్వహించారు.

- టెక్కలి: స్థానిక శాఖా గ్రంథాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి నిర్వహించారు. గ్రంథాలయాధికారి బి.రూపావతి, విద్యార్థులు పాల్గొన్నారు.
- నందిగాం: టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను శుక్రవారం పెద్దతామారాపల్లి మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్ఎం బాలక శంకరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.
- సంతబొమ్మాళి: సంతబొమ్మాళి శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమలవేసి నివాళులర్పించారు.
- సోంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కె.మోహనరావు ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రజనికుమారి, రామినాయుడు, ప్రసాద్, యుగంధర్ పాల్గొన్నారు.
- కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కమిషనర్ టి.నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



టెక్కలి: గ్రంథాలయంలో టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు



సంతబొమ్మాళి: గ్రంథాలయంలో టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు

సంక్షిప్తంగా...



పాతపట్నం అమ్మవారు

పాతపట్నం అమ్మవారికి గాజుల అలంకరణ

నందిగాం: మండల కేంద్రం నందిగాంలోని పాతపట్నం అమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారిని గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

చిట్టిబాబు మృతికి సంతాపం

కవిటి: ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ జేసీఎస్ బూత్ కన్వీనర్ రాంపత్ని చిట్టిబాబు తండ్రి రాంపత్ని రామమూర్తి(80) గురువారం రాత్రి గుండెపోటుతో మృతి పొందారు. ఈయన మృతిపట్ల పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం తెలిపారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



ఇచ్ఛాపురం రూరల్: స్థానిక తహసీల్దార్ ఎస్.వెంకటరావు శుక్రవారం కొళిగాం జెట్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం రుచి చూశారు. అనంతరం బీసీ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. వార్డెన్ లేకపోవడం, మరుగుదొడ్లు, హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.

రేపు బొడ్డపాడులో ముత్యం సంతాప సభ

పలాస: మండలంలోని బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీకాకుళం ఉద్యమం సాహిత్యం పరిశోధక రచయిత డాక్టర్ ముత్యం సంతాప సభ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకుల తరఫున సి.పి.ఐ.ఎం.ఎల్.న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు ఒక ప్రకటనలో తెలిపారు. న్యూడెమొక్రసీ పార్టీతో పాటు సి.పి.ఐ.ఎం.ఎల్ లిబరేషన్, పౌరహక్కుల సంఘం, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి ప్రతిఒక్కరూ హాజరుకావాలని కోరారు.

లే అవుట్ల పరిశీలన



కోటబొమ్మాళి: నిమ్మాడ, చిట్టివలస సచివాలయాల పరిధిలో గృహ నిర్మాణానికి సంబంధించి లేఅవుట్ల ఏర్పాటుకు శుక్రవారం మండల ప్రత్యేకాధికారి ఆర్.గడ్డెమ్మ, ఎంపీడీఓ కె.ఫణీంద్రకుమార్ స్థల పరిశీలన చేశారు. నివేదికను కలెక్టర్‌కు పంపుతున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు ఆహ్వానం

కాశీబుగ్గ: మందస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్లుగా పని చేయడానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బత్సల తేజేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వృత్తి విద్య కోర్సుల్లో టైపు, షార్ట్‌హేండ్ లెక్చరర్ పోస్టు ఖాళీగా ఉందని పేర్కొన్నారు. పీజీలో సంబంధిత సబ్జెక్ట్‌లో 50 శాతం మార్కులకు తక్కువ కాకుండా ఉండాలన్నారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

జీతాలు విడుదల చేయాలి

కాశీబుగ్గ: ఏడాదిగా జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నామని పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్ అండ్ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సుమారు 50 మందికి జీతాలు అందాల్సి ఉందని పేర్కొన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వస్తున్నామని, కనీసం ట్రావెల్ చార్జీలకు కూడా డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి జీతాలు విడుదల చేయాలని కోరారు.

ఉపాధి నిధులతో గ్రామాభివృద్ధి



సోంపేట: గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్



టెక్కలి: పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు



ఇచ్ఛాపురం రూరల్: టి.బరంపురంలో గ్రామసభలో పాల్గొన్న ఎంపీపీ బోర పుష్ప



కంచిలి: కొల్లూరు గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వి.నీరజ



కవిటి:మండల ప్రత్యేకాధికారి వైవీఎం రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్ పూడి లక్ష్మణరావు



సంతబొమ్మాళి: మరువాడలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు



పలాస: లొద్దబద్ర గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రమేష్‌నాయుడు



వజ్రపుకొత్తూరు: మాట్లాడుతున్న సైనూరు సర్పంచ్ అట్టాడ గోపి



కోటబొమ్మాళి: అక్కయ్యవలస గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఫణీంద్రకుమార్

సోంపేట: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాలు అభివృద్ధి చేసుకోవాలని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. మండలంలోని 23 పంచాయతీల్లో శుక్రవారం ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామ సభలు నిర్వహించి పల్లెల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు గుర్తించారు. సోంపేట మేజర్ పంచాయతీలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ తదితరులు పాల్గొన్నారు. పలాసపురం పంచాయతీలో జెడ్పీటీసీ తడక యశోద, ఎంపీడీఓ బెందాళం వెంకటరమణ, సర్పంచ్ తడక జోగారావు తదితరులు పాల్గొన్నారు. జింకిభద్ర, బెంకిలి పంచాయతీల్లో ఏపీఓ ప్రమీల పాల్గొన్నారు

- సంతబొమ్మాళి: మండలంలో భావనపాడు, మర్రిపాడు, బోరుభద్ర, సంతబొమ్మాళి, మరువాడ, నౌపడ, యామలపేట, డీజీ పురం తదితర పంచాయతీల్లో గ్రామ సభలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. సర్పంచ్‌లు సూరాడ ధనలక్ష్మి, నెక్కట్ల అప్పన్న, బి. లక్ష్మీకాంతం, వాడరేవు కృష్ణ, అట్టాడ కల్పన, తదితరులు పాల్గొన్నారు.
- టెక్కలి: గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని టెక్కలి మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సుజాత కోరారు. శుక్రవారం టెక్కలి పంచాయతీ కార్యాలయంలో గ్రామసభలు నిర్వహించారు. ఈఓ మల్లేశ్వరరావు, వార్డు సభ్యుడు గురివినాయుడు, స్థానిక నాయకులు బి.శేషు, కె.లవకుమార్, ఎం.రాము, కాశీ, కామేష్, ప్రీతీష్, నరేంద్ర పాల్గొన్నారు.
- ఇచ్ఛాపురం రూరల్: పల్లెలే దేశానికి పట్టుగొమ్మలని ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ అన్నారు. శుక్రవారం టి.బరంపురం, ఈదుపురం గ్రామ సచివాలయాల వద్ద గ్రామ సభలు నిర్వహించారు. ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు లొద్దపుట్టి, ఎంఈఓ కురమాన అప్పారావు తేలుకుంచి, తహసీల్దార్ ఎస్.వెంకటరావు కొళిగాం పంచాయతీల్లో జరిగిన గ్రామ సభల్లో పాల్గొన్నారు.
- పలాస: స్వర్ణ గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దాలని పలాస ఎంపీడీఓ ఎన్.రమేష్‌నాయుడు చెప్పారు. పలాస మండలంలోని అన్ని గ్రామ పంచాయితీల్లో శుక్రవారం గ్రామ సభలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్‌నాయుడు, పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, మద్దిల పాపారావు, పంచాయతీ కార్యదర్శి శరత్ చంద్ర, మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.
- కంచిలి: ఉపాధితో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని డ్వామా ఏపీడీఓ సిహెచ్. శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు కంచిలి పంచాయతీ కేంద్రంలోని రాధాక్రిష్ణ ఆలయం ఆవరణలో గ్రామ సభ నిర్వహించారు. బూరగాం సభలో మండల ప్రత్యేకాధికారి డాక్టర్ వి.జయరాజ్, కంచిలి, కొల్లూరు, బెల్లుపడ, పోలేరు గ్రామ పంచాయతీ సభల్లో ఎంపీడీఓ వి.నీరజ, కొల్లూరు సభలో ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి పాల్గొన్నారు.
- కవిటి: కవిటి పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామసభలో మండల ప్రత్యేకాధికారి వైవీఎం రెడ్డి పలు అభివృద్ధి పనుల నివేదికల్ని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఈఓ వీరభద్రస్వామి తదితరులు పాల్గొన్నారు.
- వజ్రపుకొత్తూరు: సైనూరు పంచాయతీ కేంద్రంలో నిర్వహించిన గ్రామసభలో సర్పంచ్ అట్టాడ గోపి రానున్న మాట్లాడుతూ రానున్న ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న ఉపాధి పనులపై తీర్మానించారు. సమావేశంలో ఉప సర్పంచ్ చింత లలితమ్మ, వైఎస్సార్‌సీపీ నేతలు గోకిన గణపతి, కోకిల రామారావు పాల్గొన్నారు.
- కోటబొమ్మాళి: గ్రామసభలో గుర్తించిన పనులకు అధిక ప్రాధాన్యమిచ్చి వెంటనే మంజూరుచేస్తామని ఎంపీడీఓ కె.ఫణీంద్రకుమార్ అన్నారు. ఈ మేరకు అక్కయ్యవలస గ్రామసభలో సమస్యలపై చర్చించారు. సర్పంచ్ సుంకరి జనార్దన, యిట్రాజుల తాత పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడే వ్యాపారాలు చేయాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ సత్యనారాయణ

ఇచ్ఛాపురం: నిబంధనలకు లోబడే వ్యాపారాలు చేయాలని, కొనుగోలుదారులకు అన్ని రకాలుగా రక్షణ కల్పించాల్సిన బాధ్యత యజమానులదేనని ఇచ్ఛాపురం పట్టణ ఎస్సై వి.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొనుగోలుదారులకు పార్కింగ్ సదుపాయం కల్పించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ రోడ్లపై బళ్లు పెట్టరాదని స్పష్టం చేశారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. షాపుల్లో లోడింగ్, అన్‌లోడింగ్ వంటివి ఉదయం 8 ముందుగాని, రాత్రి 8 తరువాత గాని చేసుకోవాలని సూచించారు.